మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 247
పేజీలు : 3


మంగళవారం -7 ఏప్రిల్, 2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు పెరగలేదు

• పుష్కలంగా ఆహార నిల్వలు : కేంద్రం కీలక ప్రకటన




**టీ మీడియా ,ఏప్రిల్ 6 , ఢిల్లీ బ్యూరో :**
పశ్చిమాసియా సంక్షోభం కారణంగా దేశంలో నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులేమీ లేవని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లలో ధరలను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు, అలాగే ఏవైనా అత్యవసర పరిస్థితులకు సరిపడా గోధుమలు, బియ్యం నిల్వలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ అదనపు కార్యదర్శి అనుపమ్ మిశ్రా వ్యాఖ్యానించారు.దేశంలో ఆహార భద్రత పరిస్థితిని వినియోగదారుల వ్యవహారాల శాఖ నిశితంగా గమనిస్తోంది. ఆహార పదార్థాల ధరలను పర్యవేక్షిస్తున్నాం. అలాగే ఆహార పదార్థాల నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను నిరోధించడానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న 528 కేంద్రాల నుంచి వినియోగదారుల వ్యవహారాల శాఖ ప్రతిరోజూ 40 రకాల వస్తువుల ధరలను పొందుతుంది. హోల్‌సేల్, రిటైల్ ధరలు మొబైల్ యాప్‌లో అప్డేట్ చేస్తున్నాం. ఇప్పటివరకు మేము గమనించిన వరకు నిత్యావసర వస్తువుల ధరల్లో ఎటువంటి అసాధారణ హెచ్చుతగ్గులు లేవు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పప్పుధాన్యాల ఉత్పత్తి ఎక్కువగా ఉంది. ప్రభుత్వం వద్ద 28 లక్షల టన్నుల పప్పుధాన్యాల బఫర్ స్టాక్ ఉంది. ఉల్లిపాయలు, బంగాళదుంప, టమాటాల ఉత్పత్తి దాదాపు గతేడాది స్థాయిలోనే ఉంది. " అని అనుపమ్ మిశ్రా పేర్కొన్నారు.

# విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన



• సీఎం రేవంత్ రెడ్డి



**టీ మీడియా, ఏప్రిల్ 6 , ఆదిలాబాద్ :**
గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్? జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ సర్కారు తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆదిలాబాద్? ఎయిర్?పోర్ట్?కు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. ఈ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలోనే ఆదిలాబాద్?కు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్నటువంటి ఆలయాలన్నింటిని అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. ఆదిలాబాద్? జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి శంకుస్థాపన చేసిన రేవంత్ రెడ్డి పిప్పిరిలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు.

**వారు రాజకీయ ప్రత్యర్థులే తప్ప శత్రువులు కాదు**
ఆదిలాబాద్? జిల్లా ప్రజలు అమాయకులే కాదు, నిరంకుశత్వంపై పోరాడినటువంటి వీరులు, కుమురంభీం లాంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేశారని రేవంత్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్? జిల్వాకు ఆధునిక విద్య, వైద్యం లాంటి సదుపాయాలు ఇంకా దక్కలేదని వివరించారు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకుని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోరాడారని సీఎం తెలిపారు.ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం తమది కాదని వివరించారు. గతంలో సీఎం వస్తుంటే ప్రతిపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినప్పటికీ, అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు తమకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే తప్ప శత్రువులు కాదని తెలిపారు.

**మండలాలు, జిల్లాల హద్దులు మార్చేది అప్పుడే**
2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే ప్రజల ఆకాంక్షల మేరకు హద్దులు మారుస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లను పేదల ఖాతాల్లో జమచేశామన్న ఆయన సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా? అని ప్రశ్నించారు. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం దేశంలో మరొకటి లేదని అన్నారు. యువత మత్తుబాట వదిలి మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నట్లుగా తెలిపారు. ఆదాయం పెంచాలి, పేదలకు పంచాలి అనే ఆశయంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. బాసర ఆలయం అభివృద్ధికి రూ.220 కోట్లు మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. దేశంలోనే గొప్ప సరస్వతి ఆలయంగా బాసరను అభివృద్ధి చేస్తామన్నారు. గూడెం సత్యనారాయణ ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు.

**ఆదిలాబాద్‌ను అగ్రగామిగా నిల్పుతాం**
విద్యా, ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఆదిలాబాద్‌ను అగ్రగామిగా నిలుపుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గిరిజన జిల్లాగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాకి విమానాశ్రం సౌకర్యాన్ని కల్పించి పర్యాటకంగానే కాకుండా పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరిలో నీళ్లు పారిస్తామన్నారు. గూడెం సత్యనారాయణస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని సీఎం అన్నారు.






## తండ్రీకొడుకుల లాకప్‌డెత్ కేసు
### 9మంది పోలీసులకు మరణశిక్ష

**టి మీడియా,ఏప్రిల్ 6, సత్తాంకుళం :**
దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2020 నాటి సత్తాంకుళం లాకప్ డెత్ కేసులో మధురైలోని ఒకటవ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వ్యాపారి జయరాజ్, ఆయన కుమారుడు బెనిక్స్ మరణానికి కారణమైన 9 మంది పోలీసులకు మరణశిక్ష విధించింది. ఈ కేసులో మొత్తం 10 మంది పోలీసులపై సీబీఐ కేసు నమోదు చేయగా, విచారణ సమయంలో ఒక పోలీసు అధికారి కొవిడ్ కారణంగా మృతిచెందారు.2020 జూన్ 19న జయరాజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడి కుమారుడు బెనిక్స్ పోలీసు స్టేషన్‌కు చేరుకొని తన తండ్రిని కొట్టడాన్ని అడ్డుకున్నాడు. దీంతో పోలీసులతో ఎలా ప్రవర్తించాలో బుద్ధి చెబుతాం అంటూ ఇద్దరినీ రాత్రంతా విచక్షణారహితంగా చిత్రహింసలకు గురిచేశారు. మరుసటి రోజు ఉదయం ఒక పారిశుద్ధ్య కార్మికుడితో రక్తాన్ని శుభ్రం చేయించి ఆధారాలను ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. ఒక మహిళా హెడ్ కానిస్టేబుల్ వాంగ్మూలం, మెడికల్ రిపోర్ట్, జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ నివేదిక ఆధారంగా మద్రాస్ హైకోర్టు మధురై ధర్మాసనం సుమోటోగా స్పందించి, పోలీసులపై హత్య కేసు నమోదు చేయాలని ప్రాథమికంగా నిర్ధరించింది. అనంతరం అప్పటి అన్నాడీఎంకే ప్రభుత్వం ఈ కేసు విచారణను సీబీఐకి అప్పగించింది. సెప్టెంబర్ 2020లో సీబీఐ ఛార్జిషీట్ దాఖలు చేయగా, సోమవారం న్యాయస్థానం ఈ చారిత్రక తీర్పును వెలువరించింది.

## బాసర ఆలయానికి మహర్దశ

• రూ.225 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ



**టీ మీడియా, ఏప్రిల్ 6 ,నిర్మల్ :**
జిల్లా బాసరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన సాగింది. ఆయన కుటుంబంతో కలిసి బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ అధికారులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం దంపతులు తమ మనవడు రియాన్ష్?కు అక్షరాభ్యాసం చేయించారు. బాసర ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి, కొండా సురేఖ, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


**మాస్టర్ ప్లాన్‌ను రూపొందించిన అధికారులు**
బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయ విస్తరణ పనులను చేసేందుకు అధికారులు రూ.225 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఆలయ పునరాభివృద్ధి నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారమే విడుదల చేసింది. బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి గర్భాలయం, అర్ధ మండపం, రాజ గోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల అభివృద్ధి నిర్మాణాలకు సంబంధించి అనుమతులను శృంగేరి పీఠం నుంచి తీసుకున్నారు. వారి సూచనలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి కోసం మాస్టర్ ప్లాన్‌ను అధికారులు రూపొందించారు. ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు విస్తరించనున్నారు. ఉత్తరం వైపు 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారాలను అభివృద్ధి చేయనున్నారు.

**ధ్యానం చేసుకునేలా మందిరం**
ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు విస్తరించనున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణంలో అద్భుత శైలిని కలిగిన శిలలను ఉపయోగించనున్నారు. 6 వేల మంది భక్తులకు ఫీడింగ్ రూమ్, ఫుడ్ స్టాల్స్, శౌచాలయాలు తదితర వసతులతో 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు నిర్మాణం చేస్తారు. 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా పెద్ద మందిరం, 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంతో వంటశాల, భోజన శాలలు, ప్రసాద విక్రయ కౌంటర్లు సహా ఈశాన్య దిక్కున మంచినీటి కోనేరు, తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో విశాలమైన రోడ్లు అభివృద్ధి చేయనున్నారు.శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో బిజీ బిజీ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కల పర్యటిస్తున్నారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్‌కు 3 ఏళ్లు పూర్తైన సందర్భంగా సభ నిర్వహిస్తిన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. జైనథ్‌లో రూ.20 కోట్లతో నిర్మించిన గురుకుల పాఠశాల బాలుర భవనం, ఆదిలాబాద్‌లో మైనారిటీ గురుకుల బాలికల విద్యాలయం, సిరికొండ నుంచి ఇంద్రవెల్లి వరకు నిర్మించిన లాంగ్ స్పాన్ బ్రిడ్జిలను ప్రారంభోత్సవం చేశారు.

పిప్పిరి ఎత్తిపోతల పథకం, తేజపూర్ ఎత్తిపోతల పథకం, బుగ్గారం ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేశారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం లాండసాంగి చెక్‌డ్యాం, బోథ్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనం, పొచ్చరలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ నిర్మాణం, నాగోబా ఆలయ సుందరీకరణ అభివృద్ధి పనులకు రూ.20.40 కోట్లు, లక్కారంలో ఐటీడీఏ ఉట్నూర్ నూతన భవన నిర్మాణం, ఇచ్చోడ నుంచి డెడ్రా వరకు రూ.30 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేశారు.


## 15 పాయింట్ల ప్రణాళికను ఒప్పుకోం

**మా డిమాండ్ల ప్రకారమే సైనిక ఘర్షణకు తెర**



**టీ మీడియా, ఏప్రిల్ 6 , ఢిల్లీ బ్యూరో:**
హర్మూజ్ జలసంధిని ఏప్రిల్ 7న రాత్రి 8 గంటల్లోగా తెరవకుంటే తీవ్ర పర్యవసానాలు ఉంటాయంటూ అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ విధించిన డెడ్‌లైన్ ముంచుకొస్తున్న వేళ ఇరాన్ స్పందించింది. పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా ప్రతిపాదించిన 15 పాయింట్లు అతి డిమాండ్లతో ఉన్నాయని ఇరాన్ విదేశాంగ శాఖ మండిపడింది. పచ్చి అబద్ధాలతో, ఇరాన్‌పై భారాన్ని మోపేలా ఉన్న ఆ పాయింట్లను అంగీకరించేది లేదని తేల్చి చెప్పింది. అమెరికా-ఇజ్రాయెల్‌లతో సైనిక ఘర్షణకు తెరదించేందుకు తాము సొంత డిమాండ్లను తయారు చేశామని ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘయి వెల్లడించారు. ఆయన చేసిన ప్రకటన వివరాలతో ఇరాన్ ఇంటర్నేషనల్ మీడియా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించింది. ఇరాన్‌తో శాంతి చర్చల కోసం అమెరికా ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళిక అత్యంత దురాశతో, అహేతుకంగా ఉందని ఇస్మాయిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బెదిరింపులతో చర్చలు జరగవని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్‌లోని మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని అమెరికా చేస్తున్న హెచ్చరికలు యుద్ధ నేరాల పరిధిలోకి వస్తాయన్నారు. అమెరికా చర్చల ప్రతిపాదనకు మధ్యవర్తి దేశాల ద్వారా ఈమేరకు ఇరాన్ సమాధానాన్ని తెలియజేశామని ఆయన చెప్పారు.

## వారంలోనే ఇంటర్మీడియట్ ఫలితాలు




**టీ మీడియా, ఏప్రిల్ 6 , హైదరాబాద్:**
తెలంగాణ ఇంటర్మీడియట్ ఫస్ట్, సెంకడ్ ఇయర్ పబ్లిక్ పరీక్షల 2026 సమాధాన పత్రాల మూల్యాంకనం మార్చి 30తో ముగిసిన సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో మూల్యాంకనం ముగియడంతో ఫలితాల క్రోడీకరణ పనుల్లో అధికారులు మునిగిపోయారు. ఈ ప్రక్రియను ఏప్రిల్ రెండో వారం నాటికి పూర్తి చేసి.. ఏప్రిల్ 12 నాటికి ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్ బోర్డు అధికారులు భావిస్తున్నారు. అంతా సవ్యంగా జరిగితే అంతకంటే ముందే అంటే ఏప్రిల్ 10వ తేదీనే ఫలితాలు వెల్లడించాలని అధికారులు భావిస్తున్నారు. లేదంటే ఏప్రిల్ 12వ తేదీన విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు ఏప్రిల్ రెండో వారంలో విడుదల చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. నిజానికి తొలుత ఏప్రిల్ 6న అంటే ఈ రోజు ఫలితాలు విడుదల చేయాలనుకున్నప్పటికీ బడ్జెట్ సమావేశాలు ఇతర పనులతో రెండో వారానికి వాయిదా వేశారు.కాగా ఈ ఏడాది తెలంగాణ ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 17 వరకు, సెకండ్ ఇయర్ పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు జరిగిన సంగతి తెలిసిందే. ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ కలిపి ఈ ఏడాది మొత్తం 9 లక్షలకుపైగా విద్యార్థులు పరీక్షలు రాశారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 4 లక్షల మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 5 లక్షల మంది ఉన్నారు. వీరంతా ప్రస్తుతం ఫలితాల కోసం ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. స్పాట్ వాల్యుయేషన్ ప్రాసెస్ పూర్తి కావటంతో మార్కుల ప్రాసెస్ ప్రక్రియ కొనసాగుతోంది. మార్కుల ఎంట్రీ, సాంకేతిక అంశాలు, ఫలితాల క్రోడీకరణ ప్రస్తుతం తది దశలో ఉన్నాయి. రెండు మూడు రోజుల్లో ఇవన్నీ పూర్తయ్యే అవకాశం ఉంది.ఏప్రిల్ 10 నుంచి 12వ తేదీల మధ్యలో ఫలితాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రభుత్వ అనుమతి తీసుకొని ఫలితాల విడుదలకు తేదీని ఖరారు చేసే అవకాశం ఉంది. ఒకేసారి ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ ఫలితాలు వెల్లడిస్తారు. ఇందుకు సంబంధించి ఇంటర్ బోర్డు నుంచి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుంది.

# కరీంనగర్‌లో కవల పిల్లల హత్య

- కన్నతండ్రితో సహా నలుగురు అరెస్ట్

**టీ మీడియా ,ఏప్రిల్ 6 , కరీంనగర్ :**
సొంత బిడ్డలనే కాలయముడిలా మారి బావిలో ముంచి చంపిన దారుణ ఘటనలో కన్నతండ్రితో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తిపై మక్కువతో, ఆడపిల్లలనే వివక్షతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో వెల్లడైంది.




**ఘటన నేపథ్యం**
కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్ నివాసి కచ్చు శ్రీశైలం (28), ప్రతిమ మెడికల్ కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో మౌనికతో ఇతనికి వివాహం కాగా, 2022లో వీరికి కవల ఆడపిల్లలు గీతంశి, గీతన్విక జన్మించారు. అయితే మొదటి నుండి మగపిల్లవాడు కావాలని కోరుకున్న శ్రీశైలంకు, ఆడపిల్లలు పుట్టడం ఇష్టం లేదు. సుమారు 2 కోట్ల విలువైన ఆస్తి ఆడపిల్లల పెళ్లిళ్లకే సరిపోతుందని భావించిన శ్రీశైలం, తన తల్లిదండ్రులు అశోక్, లావణ్య మరియు తమ్ముడు రాకేష్‌తో కలిసి పిల్లలను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు.

**పథకం ప్రకారం హత్య**
ఏప్రిల్ 3న, పథకం ప్రకారం నిందితుడు శ్రీశైలం తన భార్యను ఇంట్లోనే ఉండమని చెప్పి, బలవంతంగా ఇద్దరు కుమార్తెలను మోటార్ సైకిల్‌పై పొలం వద్దకు తీసుకెళ్లాడు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి, నలుగురు నిందితులు ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారం, శ్రీశైలం ఇద్దరు చిన్నారులను వ్యవసాయ బావిలోకి తోసివేశాడు. నీటిలో మునిగిపోతున్న గీతంశి ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతుండగా, తనే బావిలోకి దిగి ఆమెను నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి చంపేశాడు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, పిల్లలను కాపాడబోతున్నట్లుగా నటిస్తూ కేకలు వేశాడు.విచారణ నిందితుడి ప్రవర్తనపై అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సి.ఐ. నిరంజన్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు గోపాల్‌పూర్‌లో తలదాచుకున్నట్లు గుర్తించారు. ఆదివారం ఏప్రిల్ 5 మధ్యాహ్నం నిందితులను అదుపులోకి తీసుకోగా, వారు తమ నేరాన్ని అంగీకరించారు. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన రూరల్ ఏసీపీ విజయ కుమార్, సి.ఐ. నిరంజన్ రెడ్డి మరియు సిబ్బందిని కరీంనగర్ సి.పి. గౌష్ ఆలం అభినందించారు.

# మండే ఎండల్లో చల్లటి వార్త

- రెండ్రోజుల పాటు భారీ వర్షాలు

**టీ మీడియా ,ఏప్రిల్ 6 , అమరాతి బ్యూరో:**
ఆంధ్రప్రదేశ్ వాసులకు వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో రాబోయే రెండ్రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని తూ.గో, ప.గో, ఏలూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే అల్లూరి, కాకినాడ, కోనసీమ, చిత్తూరు జిల్లాల్లో కూడా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఈ వర్షాల సమయంలో 40-60 కి.మీ. వేగంతో



ఈదురుగాలులు కూడా వీస్తాయని తెలిపింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల చెబుతున్నారు.ఇక ఉపరితల ఆవర్తణ ద్రోణి ప్రభావంతో తెలంగాణలోనూ రాబోయే మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. ఈరోజు,రేపు, ఎల్లుండి రాష్ట్రంలో తేలికపాటి నుండి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని తెలిపింది. అలాగే రానున్న మూడు రోజులలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే వర్షాల సమయంలో కొన్ని జిల్లాల్లో ఉరుములు మెరుపులుతో కూడి వర్షాలతో పాటు 30 నుండి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు కూడిన వీచే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.ఇదిలా ఉండగా అటు తెలంగాణలోనూ ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ ,బూర్గంపాడు, భద్రాచలంలో ఉన్నట్టుండి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి కాగా వర్షం పడటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది.




## క్వారీ రద్దుకు సంతకాల సేకరణ

**టీ మీడియా, ఏప్రిల్ 6, చిన్నచింతకుంట:**
మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండల కేంద్రంలో 2రోజు శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవాలయ సమీపంలో మైనింగ్ (క్వారీ)కి అనుమతులు రద్దు చేయాలని మైనింగ్ (క్వారీ)కి అక్రమంగా అనుమతులు ఇచ్చిన సంబంధించిన అధికారుల పై తగు చర్యలు తీసుకోవాలని శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి గుట్ట పరిరక్షణ కొరకై శ్రీకురుమూర్తి స్వామి ఆలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమానికి పూర్తి స్థాయిలో మద్దతు తెలుపుతున్న శ్రీ కురుమూర్తి స్వామి భక్తులు శ్రీ కురుమూర్తి స్వామి ఏడు గుట్టలలో ఒకటైన శేషాద్రి గుట్టలో క్వారీ ఏర్పాటు వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు అలాగే దేవాలయం పవిత్రతను బ్లాస్టింగ్ వల్ల గర్భగుడికి కూడా ఇబ్బంది కలుగుతుందని వెంటనే శ్రీ కురుమూర్తి స్వామి గుట్టలో క్వారీ ఏర్పాటుకై అనుమతులు ఇవ్వడం మానుకోవాలని కురుమూర్తి గ్రామంలో సంతకాల సేకరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కురుమూర్తి గ్రామ ప్రజలు,యువకులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్ఠ శివాలయ భూమి పూజకు హాజరైన మాజీ మంత్రి

**టీ మీడియా, ఏప్రిల్ 6 పెబ్బేరు :**
సోమవారం పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని మిట్ట భక్తాంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న నిరంజన్ రెడ్డి బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి మిట్టఆంజనేయస్వామి ధ్వజస్తంభం కార్యక్రమం అట్ట



హాసంగా ప్రారంభమైంది ఇట్టి కార్యక్రమానికి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు స్వామివారి ఆశీస్సులు పెబ్బేరు మున్సిపల్ పట్టణ ప్రజలందరిపై ఉండాలని ఆ స్వామి వారిని ప్రార్థించారు అదేవిధంగా శివాలయానికి భూమి పూజలో పాల్గొని ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయపడతానని ఆలయ కమిటీకి తెలియజేయడం జరిగింది పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలో ఇలాంటి బృహత్తరమైన కార్యక్రమాలు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించడం చాలా సంతోషకరమని అభినందించారు. హర్షం వ్యక్తం చేశారు మిట్ట భక్తాంజనేయ స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ట శివాలయం భూమి పూజ కార్యక్రమం లో పాల్గొనడం ఎంతో శుభసూచకమని ఆ స్వామి ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని మిట్ట భక్త ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ సభ్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ని శాలువాతో సత్కరించడం జరిగింది బి ఆర్ ఎస్ పార్టీ కౌన్సిలర్ సౌజన్య దిలీప్ రెడ్డి సార్ వెళ్ళే వరకు వెంటే నడిచారుఈ కార్యక్రమంలో పెబ్బేరు మున్సిపల్ బి ఆర్ ఎస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అన్ని తెలిసినోడే వాడి బుట్టలో పడ్డాడు

- లక్షలు లక్షలు వసూలు చేశాడు కేటుగాడు

**టీ మీడియా ,ఏప్రిల్ 6 , సత్యసాయి :**
ఆయనో తాహసీల్దార్.. అతనికి అన్నీ తెలుసు.. కానీ, అతన్నే.. ఏసీబీ అధికారి అంటూ ఓ వ్యక్తి బెదిరించి ఏకంగా.. లక్షలు లక్షలు వసూలు చేశాడు ఓ కేటుగాడు.. తాను ఏసీబీ అధికారినని.. తన అవినీతి చిట్టా అంతా నా దగ్గర ఉందంటూ.. తహసీల్దార్ ను పరిచయం చేసుకున్నాడు.. అంతటితో ఆగకుండా ఏసీబీ అధికారులతో వచ్చి దాడులు చేస్తామని బెదిరించి తాహసీల్దార్ దగ్గర నుంచి దఫా దఫాలుగా 50 లక్షల రూపాయలు వసూలు చేశాడు.. తర్వాత.. కొన్ని రోజులకు అతను ఏసీబీ అధికారి కాదని పక్కా 420 అని తెలిసింది. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్ లో కలకలం రేపింది.. వివరాల్లోకి వెళితే.. శ్రీ సత్య సాయి జిల్లా ముదిగుబ్బ తహసిల్దార్ అన్వర్ హుస్సేన్ కు 2021 సంవత్సరంలో ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్లో అవతలి వ్యక్తి తనను తాను ఏసీబీ సీఐ హరినాథ్ అని పరిచయం చేసుకున్నాడు. మీ పై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి.. త్వరలోనే తాహసీల్దార్ కార్యాలయం, ఇంట్లో సోధాలు చేస్తామని తహసిల్దార్ అన్వర్ హుస్సేన్ ను ఏసీబీ సీఐ హరినాథ్ బెదిరించాడు. ఏసీబీ అధికారి హరినాథ్ బెదిరింపులతో భయపడ్డ తహసిల్దార్ అన్వర్ హుస్సేన్... అనేక సార్లు దఫ దఫాలుగా 50 లక్షల రూపాయలు ఏసీబీ సీఐ హరినాథ్ కు ఇచ్చాడు. కట్‌చేస్తే ఓ రోజు ముదిగుబ్బ తాహసీల్దార్ కార్యాలయం పై ఏసీబీ అధికారులు నిజంగానే దాడి చేసి సోదాలు చేయడంతో.. ఎమ్మార్వో అన్వర్ హుస్సేన్ షాక్ అయ్యాడు. ఇన్ని రోజులు తాను మాట్లాడింది.. ఏసీబీ సోదాలు జరక్కుండా డబ్బులు ఇచ్చింది ఓ నకిలీ




ఏసీబీ అధికారికి అన్న సంగతి తెలుసుకొని, మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు.ఈ ఘటనపై అప్పట్లోనే కేసు నమోదు అయింది. తాజాగా కేసు విచారణను వేగవంతం చేసి నిందితుడిని పట్టుకోవాలని సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించడంతో.. కేసు రీ ఓపెన్ చేసి నిందితుడిని గుర్తించారు. కూడేరు మండలం కలగల్లు గ్రామానికి చెందిన హనుమంతు నకిలీ ఏసీబీ అధికారి అవతారమెత్తి.. ముదిగుబ్బ తహసిల్దార్ అన్వర్ హుస్సేన్ ను బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. నకిలీ ఏసీబీ అధికారి హనుమంతును ట్రాక్ చేసి ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. అవినీతి అధికారుల భయమే.. నకిలీ ఏసీబీ అధికారుల పాలిట వరమై.. కాసులు కురిపించిందని పలువురు పేర్కొంటున్నారు. ఇలాంటి ఫోన్లు వస్తే పోలీసులను సంప్రదించాలని సూచిస్తున్నారు.



## క్వారీ రద్దుకు సంతకాల సేకరణ

**టీ మీడియా ,ఏప్రిల్ 6 ,చిన్న చింతకుంట:**
మహబూబ్నగర్ జిల్లా దేవర్కద్ర నియోజకవర్గం చిన్నచింతకుంట మండలంలోని శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ పవిత్రతను కాపాడుకుందాం అని కురుమూర్తి స్వామి గుట్టలో క్వారీ ఏర్పాటును రద్దు చేయాలనీ సంతకాల సేకరణలో పాల్గొన్న కురుమూర్తి గ్రామస్థులు.శ్రీ కురుమూర్తి స్వామి ఏడు గుట్టలలో ఒకటైన శేషాద్రి గుట్టలో క్వారీ ఏర్పాటు వల్ల పర్యావరణానికి, వన్యప్రాణులకు అలాగే దేవాలయం పవిత్రతను బ్లాస్టింగ్ వల్ల గర్భగుడికి కూడా ఇబ్బంది కలుగుతుందని వెంటనే శ్రీ కురుమూర్తి స్వామి గుట్టలో క్వారీ ఏర్పాటుకై అనుమతులు ఇవ్వడం మానుకోవాలని కురుమూర్తి గ్రామంలో సంతకాల సేకరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో కురుమూర్తి గ్రామ ప్రజలు,యువకులు, హిందూ బంధువులు పాల్గొన్నారు.

## అండర్ డ్రైనేజీ భూమి పూజ పనులకు శ్రీకారం

**టీ మీడియా ఏప్రిల్ 6 :పెబ్బేరు :**
సోమవారం పెబ్బేరు మండల పరిధిలోనీ బునియాదిపురం గ్రామంలో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు గ్రామ అభివృద్ధి దిశగా బి ఆర్ ఎస్ మండల అధ్యక్షులు వనం రాములు గ్రామ అధ్యక్షులు మేకల గోవిందు మార్కెట్ డైరెక్టర్ ఆంజనేయులు ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ వజగౌని విజయ్ గౌడ్ పంచాయతీ కార్యదర్శి కర్ణాకర్ రెడ్డి




హాజరయ్యి భూమి పూజ నిర్వహించారు ఈ సందర్భంగా వార్డు సభ్యులు వనం సహదేవుడు గుంటి సత్యం మారమోని రమేష్ గ్రామస్తులు మద్దిలేటి చిన్న రాముడు గుంటి రాములు మారుమోని సత్యం క్యాతమోని ఎల్లస్వామి పాల్గొన్నారు.గ్రామంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో పరిశుభ్రత మెరుగుపడటంతో పాటు ప్రజల ఆరోగ్యానికి మేలు చేకూరనుంది ఈ అభివృద్ధి పనులు త్వరగా పూర్తవ్వాలని గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.

## అరగంట వ్యాయామం ఎంతో ఆరోగ్యం

- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 6, వనపర్తి బ్యూరో :**
మనిషి రోజు వారి కార్యక్రమాల్లో వ్యాయామానికి ఎంతో ప్రాధాన్యత ఉందని రోజు అరగంట వ్యాయామం చేస్తే ఎంతో ఆరోగ్యంగా ఉంటామని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.సోమవారం వనపర్తి పట్టణంలోని కొత్తకోట రోడ్డులో జగత్ పల్లి గ్రామానికి చెందిన గణేష్ అనే యువకుడు నూతనంగా ఏర్పాటు చేసుకున్న అధునాతన గోల్డెన్ జిమ్మును ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిరోజు ఉదయం 30 నిమిషాలపాటు జిమ్ లో వ్యాయామంచేయడం ద్వారా మనిషిలోనిడయాబెటిస్, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు, ఆర్థరైటిస్, క్యాన్సర్ ప్రమాదం తగ్గించుకుని రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని సూచించారు.దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో ఇలాంటి అధునాతన జిమ్ ను ఏర్పాటు చేయడం అభినందనీయమని యువకుడు గణేష్ ను అభినందించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాధ్య మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మార్చి మున్సిపల్ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, బి కృష్ణ, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## కమిషన్లు కొట్టేయడానికి రిజర్వాయర్ ప్రతిపాదన

- ఎ.గట్టు యాదవ్ జిల్లా పార్టీ అధ్యక్షులు

**టీ మీడియా, ఏప్రిల్ 6, వనపర్తి బ్యూరో :**
18వందల కోట్ల ప్రతిపాదనలతో కమిషన్లు కొట్టేయడానికి గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదన. ప్రజాధనం దుర్వినియోగం కట్టడి చేయడానికి హరీష్ పర్యటన చేస్తున్నారని ఎ.గట్టు యాదవ్ జిల్లా పార్టీ అధ్యక్షులు తెలిపారు .మాజీ మంత్రి సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి ఆదేశానుసారం ఈనెల 9వ తారీఖ మాజీ మంత్రి తన్నీరు.హరీష్ రావు పర్యటనను విజయవంతం చేయాలి అని జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ శ్రీరంగాపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ కె.ఎల్. ఐ ద్వారా గుడిపల్లి రిజర్వాయర్, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా ఎదుల రిజర్వాయర్ ద్వారా సాగు నీళ్లు సమృద్ధిగా అందించే అవకాశం ఉన్నా కేవలం కమీషన్ల కోసం 1800కోట్ల ప్రతిపాదనలతో 1352 ఎకరాల సాగు భూమిని సేకరించి రైతులను నిండా ముంచడానికి ఎం.ఎల్.ఏ ప్రయత్నం చేస్తున్నారని గట్టు యాదవ్ ఆరోపించారు. ఎదుల రిజర్వాయర్ ద్వారా నల్లగొండకు నీళ్లు తరలించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మాకు అభ్యంతరం లేదని ప్రత్యామ్నాయ అవకాశం ఉన్న కమిషన్ల కోసం గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదన అడ్డుకుంటామని గట్టు యాదవ్ హెచ్చరించారు.98రోజులుగా గొల్లపల్లి చీర్కపల్లి రిజర్వాయర్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ రైతులు చేపట్టిన దీక్షకు మద్దతు తెలపడానికి గౌరవ మాజీ మంత్రి తన్నీరు.హరీశ్ రావు వస్తున్నారని వారి పర్యటన విజయవంతం చేయాలి అని గట్టు యాదవ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమములో నందిమల్ల.అశోక్,శంకర్ గౌడ్,రహీమ్, వెంకటస్వామి, పృథ్వీరాజ్,జగన్నాథం నాయుడుసుదర్శన్ రెడ్డి,గౌడు నాయక్, జె.పి.పర్వతాలు తదితరులు ఉన్నారు.

## 10న కార్మిక శాఖ ఎదుట కార్మిక గర్జన

- ఆర్టీసీ జేఏసీ పిలుపు

**టీ మీడియా, ఏప్రిల్ 6, హైదరాబాద్ :**
ఆర్టీసీ ఉద్యోగుల, కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 10న నిర్వహిస్తున్న ఆర్టీసీ కార్మిక గర్జనను విజయవంతం చేయాలని టీజీఆర్టీసీ జేఏసీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశమై ప్రభుత్వ వైఖరినీ తప్పుపట్టింది.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీలో



ఏడు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నిసార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదని వెల్లడించారు. ఒకపక్కన ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ యాజమాన్యానికి తాకట్టు పెడుతూ, మరోపక్క రీ ఆర్గనైజేషన్ యాక్ట్ 2014 కు తూట్లు పొడుస్తుందని మండిపడ్డారు.తెలంగాణ పర్యాటకంబస్ భవన్‌లో సగభాగాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆక్రమించే ప్రయత్నంపై జేఏసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకపక్క గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఉన్న కార్మికులను కరీంనగర్, హైదరాబాద్ జోన్లకు బదిలీలు చేసే ప్రక్రియ చేపడుతూనే మరోప్రక్క మల్టీ ట్రేడ్ సిస్టంను తీసుకువచ్చి ఆర్టీసీ కార్మికులను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని వెల్లడించారు.జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన కారణంగా లేని సమస్యలను కార్మికుల ముందుకు తీసుకువచ్చి కార్మికుల మనోస్థైర్యాన్ని దెబ్బ తీసే విధంగా ప్రభుత్వ, యాజమాన్యాలు మైండ్ గేమ్ ఆడుతున్నాయని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి సమ్మెలోకి వెళ్లడం ఖాయమని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం థామస్ రెడ్డి, కన్వీనర్ , ఎండీ మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, యాదగిరి అన్నారు.

## మిట్ట ఆంజనేయ స్వామి గుడికి విరాళం

**టీ మీడియా ఏప్రిల్ 6 ,పెబ్బేరు:**
సోమవారం పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని మిట్ట భక్తఆంజనేయస్వామి గుడిలో ప్రతిష్ట శివాలయం భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ 12 వ వార్డు కౌన్సిలర్ సౌజన్య దిలీప్ కుమార్ రెడ్డి తల్లి తండ్రి జ్ఞాపకార్థం మిట్ట భక్తాంజనేయస్వామి గుడికి 1 00 116(ఒక లక్ష నూట పదహారు రూపాయలు) విరాళం ఆలయ అభివృద్ధి పనులకు ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.





## పట్టుదల విశ్వాసంతో చదవాలి

**టీ మీడియా, ఏప్రిల్ 6, ఆత్మకూరు:**
వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణంలోని శ్రీ వాణి హై స్కూల్ లో యూకేజీ విద్యార్థులకు పట్టభద్రుల కార్యక్రమం పాఠశాలలోని స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ ప్రధానోత్సవంను ఘనంగా నిర్వహించారు. శ్రీ వాణీ ఉన్నత పాఠశాలలో హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ వారు నిర్వహించిన క్యాంప్ లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ ఇవ్వడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆత్మకూర్ ఎంఈఓ బాలరాజు , ఎస్సై జయన్న పాల్గొన్నారు.వారి చేతులా మీదుగా విద్యార్థులకు హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్( హెచ్ ఎస్ సి) సర్టిఫికెట్స్ మొత్తం 160 మంది విద్యార్థులు ఈ సర్టిఫికెట్లు పొందడం జరిగింది మరియు యూకేజీ విద్యార్థులకు కూడా గ్రాడ్యుయేషన్ (పట్టభద్రుల) సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో పాఠశాల సలహాదారులు టి.జె విశ్వేశ్వర్,ప్రిన్స్ పాల్ లత,గంగాధర్ విపి అభిలాష, హెచ్ ఎస్ జి స్టేట్ సెక్రటరీ సంజీత్ నాయుడు క్యాంప్ ఆఫీసర్స్ .హరీ కృష్ణ, రాము నాయక్, స్కౌట్స్ మాస్టర్ రాఘవేంద్ర విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఈఓ బాలరాజు ఎస్ఐ జయన్న మాట్లాడుతూ ముందుగా పట్టభద్రులుగా పట్టపొందిన యూకేజీ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు సర్టిఫికెట్ పొందినందుకు వారికి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ కు దూరంగా ఉండాలని, చదువు పట్ల,ఆటల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని విద్య అనేది జీవితాన్ని మెరుగుపరుచుకోవడానికి అత్యంత శక్తివంతమైన సాధనం.విద్య కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా, మంచి నడవడిక, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచుతుంది. ఇది పేదరికాన్ని నిర్మూలించడానికి సమాజ అభివృద్ధికి కీలకమైన సాధన విద్య అని వారు తెలియజేశారు.




## కమలం తీర్థం పుచ్చుకున్న మాజీ ఎంపీపీ

**టి మీడియా,ఏప్రిల్ 06,ఎండపల్లి,వెల్గటూర్:**
జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.ఉమ్మడి వెల్గటూర్, ఎండపల్లి,మండలాల మాజీ వైస్ ఎంపీపీ మామిడిపల్లి విజయ ప్రసాద్ సోమవారం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, భారతీయ జనతా పార్టీలో చేరారు.బీజేపీ 46వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబారిపేటలో నిర్వహించిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో సుమారు 100 మంది అనుచరులతో కలిసి అధికారికంగా పార్టీలో చేరారు.బీజేపీ ధర్మపురి నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు విజయ ప్రసాద్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మామిడిపల్లి ప్రసాద్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి పెట్టుబడిదారుల గుత్తాధిపత్యం పెరిగిందని,పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు ఏమాత్రం గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే మనస్తాపంతో కాంగ్రెస్‌ను వీడుతున్నట్లు ప్రకటించారు.భవిష్యత్తులో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీయేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఎండపల్లి మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు, నాయకులు తిరుమల ప్రమోద్ గౌడ్, మంచికట్ల రవి,గోపినవేని గంగాచలం యాదవ్, మామిడిపల్లి రమేష్, ముచ్చర్ల రాజు,ఎర్రోజు శ్రీనివాస్,మామిడిపల్లి మధుకర్,మెడపట్ల శిరీష్, మామిడిపల్లి సత్తయ్య, ఆరెల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలతో హెల్త్ కార్డు

• కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**టీ మీడియా, ఏప్రిల్ 6,ఖమ్మం రూరల్ :**



విద్యా సంస్థలలో చదివే ప్రతి విద్యార్థికి సంబంధించిన హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి హెల్త్ కార్డు రూపొందించే విధంగా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం ఖమ్మం రూరల్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలలో తిరుగుతూ మౌళిక సదుపాయాలు, వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలు, స్టోర్ రూమ్‌లో ఉన్న బియ్యం, పప్పులు, కూరగాయలు, ఇతర సరుకుల సామగ్రిని తనిఖీ చేసి, రికార్డు రిజిష్టర్లను పరిశీలించారు. కామన్ మెనూ ప్రకారం సోమవారం విద్యార్థు లకు అందించడానికి సిద్ధం చేస్తున్న అన్నం, కూరలను పరిశీలించారు. పరిసరాలలో నీటి నిల్వలు ఉండకుండా చర్యలు చేపట్టాలని, కావాలసిన ప్రహరీ గోడ, డైనింగ్ హాల్ మరమ్మతులకు ప్రతిపాదనలు అందించాలని, మంజూరైన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మండల ప్రత్యేక అధికారులు ప్రతివారం తమ పరిధిలో ఉన్న కేజీబీవీ, గురుకులం, ప్రభుత్వ విద్యా సంస్థలను తనిఖీ చేసి అక్కడ ఉన్న వసతులు, భోజన నాణ్యత పర్యవేక్షించాలని అన్నారు. గురుకులాలు, ప్రభుత్వ విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలలో ఉన్న పిల్లలను ఆర్.బీ.ఎస్.కే. ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించే సమయంలో ప్రతి విద్యార్థికి సంబంధించిన హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి డిజిటల్ హెల్త్ కార్డు అందించే దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. గురుకులంలో విద్యార్థులకు ఆరోగ్యవంతమైన, రుచికరమైన ఆహారం అందించాలన్నారు. వంట సిబ్బంది అందించే ఆహారంతో మంచి ఆరోగ్యంతో విద్యార్థులు చదువుపై దృష్టి పెడతారని వివరించారు. వంట సిబ్బంది శుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ, ప్రభుత్వం అమలు చేసే మెనూ ప్రణాళిక పద్ధతులు ద్వారా భోజన నాణ్యతను మరింత మెరుగుపరచాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందిస్తూ పదవతరగతి పరీక్షలలో వందశాతం ఫలితాలు వచ్చే విధంగా చొరవ చూపాలని, ప్రత్యేక విద్యా క్లాసుల ద్వారా శిక్షణ ఇస్తూ పోటీ ప్రవేశ పరీక్షలకు కూడా విద్యార్థులను సన్నద్ధం చేసి వాటిలో మంచి ర్యాంకు వచ్చే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. పరిసరాలతో పాటు మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు అవసరమైన వసతులు ఏర్పాటు చేయాలని, అభివృద్ధి పనులకు మంజూరు అయిన నిధులతో కేటాయించిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వం గురుకుల విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని, వారికి మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చూపితే సహించేది లేదని, తగిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జెండర్ ఈక్విటీ కో ఆర్డినేటర్ రూబీ, ఖమ్మం రూరల్ కెజిబివి స్పెషలాఫీసర్ ఆసియా బేగం, విద్యాశాఖ, మున్సిపల్, రెవెన్యూ శాఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా గజ్వేల్ బంద్

• ఎందుకు చేస్తున్నారో చెప్పాలని కాంగ్రెస్ డిమాండ్

**టి మీడియా,ఏప్రిల్ 6,గజ్వేల్:**



సిద్దిపేట జిల్లాలో బంద్ ప్రశాంతంగా కొనసాగుతుంది. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడికి నిరసనగా బంద్? కొనసాగుతోంది. బీఆర్?ఎస్? నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగడంతో పట్టణంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ బంద్?కు అసలు కారణమేంటంటే, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో ఉండాలని కాంగ్రెస్ నాయకులు సీఎం ఫొటోను తీసుకొచ్చి కార్యాలయంలోని గోడకు తగిలించారు.

**ఇరు వర్గాలపై కేసు నమోదు**

ఆ క్యాంప్? కార్యాలయంలో గోడకున్న ఫొటోను గజ్వేల్? బీఆర్?ఎస్? ఇం?ఛార్జ్? వంటేరు ప్రతాపరెడ్డి తొలగించారు. ఆ సమయంలో బీఆర్?ఎస్?, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటన గజ్వేల్ డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. దీంతో బీఆర్?ఎస్? నాయకులు కాంగ్రెస్ నాయకులపై, మరోవైపు సీఎం రేవంత్?రెడ్డికి అవమానం జరిగిందని కాంగ్రెస్? నాయకులు ప్రతాపరెడ్డిపై ఇరు వర్గాలు పోలీసు స్టేషన్?లో ఫిర్యాదులు ఇవ్వడంతో కేసు నమోదు అయింది.

**ద్విచక్ర వాహనాలపై ర్యాలీ**

గజ్వేల్?లోని ప్రజ్ఞాపూర్? మండలంలో తెల్లవారుజామున ఆర్టీసీ డిపో ముందు బీఆర్?ఎస్? ఇన్?ఛార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి, పార్టీ శ్రేణుల ఆందోళన చేపట్టారు. ఉదయం 7 గంటల వరకు బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో దుకాణాలు స్వచ్ఛందంగా మూసేసి బందుకు మద్దతు తెలిపారు. తర్వాత పరిస్థితి కొంత సద్దుమణిగిన నేపథ్యంలో బస్సులు డిపో నుంచి బయటకు వెళ్లాయి. ఇదిలా ఉండగా మరోవైపు ద్విచక్ర వాహనాలపై బీఆర్?ఎస్? నేతలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.ఈ బంద్? సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. గజ్వేల్? ఏసీపీ నర్సింలు ఆధ్వర్యంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణంలో ఉద్రిక్తత నెలకొన్నప్పటికీ పరిస్థితిని అదుపులో పెట్టేందుకు చర్యలు చేపట్టారు. మొత్తానికి గజ్వేల్ బంద్ ప్రశాంతంగా కొనసాగుతుంది. సాధారణ జనజీవనం కొంత మేర ప్రభావితమైంది.

**డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి డిమాండ్?**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్? గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదని, ప్రజల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షురాలు ఆంక్ష రెడ్డి అన్నారు. తనపై బీఆర్?ఎస్? నాయకులు కావాలనే ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. గజ్వేల్‌లో బంద్ ఎందుకు చేపట్టారో తెలపాలని ఆంక్షరెడ్డి డిమాండ్ చేశారు. అసలు ఫొటో ఎందుకు తొలగించారంటే ప్రోటోకాల్? విషయంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అక్కడ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై కేసీఆర్? ఫొటో లేదని బీఆర్?ఎస్? నాయకులు ఫ్లెక్సీని చింపేశారని ఆంక్షరెడ్డి పేర్కొన్నారు. ఇదే ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో తప్పని సరిగా ఉండాలని ఆ ఉద్దేశంతోనే పెట్టామని ఆమె మాట్లాడారు. దీనిని బీఆర్ఎస్ కార్యకర్తలు వక్రీకరించి దాడిగా పరిగణించారని ఆమె పేర్కొన్నారు.

## టేక్మాల్‌లో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

**టీ మీడియా ,ఏప్రిల్ 6, టేక్మాల్ ప్రతినిధి:**



మండల కేంద్రంలోని స్వప్న-శివరాజ్ దంపతులు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకుని సోమవారం ఘనంగా గృహ ప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా నిమ్మ రమేష్ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటూ, వారి సంక్షేమానికి కట్టుబడి ఉండేది ఒక్క కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం మాత్రమేనని ధీమా వ్యక్తం చేశారు. ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి గూడు కల్పించాలనే సంకల్పంతోనే ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా, అర్హతే ప్రాతిపదికగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.కమిటీ కృషి: క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తించడంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు అత్యంత కీలకమైన బాధ్యతను పోషిస్తున్నారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో డి.సి.సి కార్యదర్శి అషిలీ విద్యాసాగర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మజర్, టౌన్ ప్రెసిడెంట్ కిషోర్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బాలమని, ధనుంజయ, శ్రావణి, శివాగౌడ్ మరియు స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## పోస్టర్ ఆవిష్కరణలో బహుజన నాయకులు

**టీ మీడియా, ఏప్రిల్ 6, టేక్మాల్ ప్రతినిధి:**

భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్, మరియు మహాత్మా జ్యోతిరావు పూలే వంటి మహనీయుల ఆశయాలను గౌరవిస్తూ నిర్వహించే జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని బహుజన నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం టేక్మాల్ మండల కేంద్రంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు మరియు నాయకులతో కలిసి ఉత్సవాల గోడ పత్రికను పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సభ నిర్వాహకులు మాట్లాడుతూ, ఏప్రిల్ 13వ తేదీన జోగిపేటలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో మహనీయుల ఉమ్మడి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు ముఖ్య వక్తలుగా ప్రముఖ సామాజిక విశ్లేషకులు నలిగంటి శరత్ చామర్, అరుణ గోగులమండ విచ్చేసి ప్రసంగిస్తారని వివరించారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సభ నిర్వాహకులు అరిటిక్యాల శంకరయ్య, పొట్టిపల్లి మొగులయ్యలతో పాటు సంగారెడ్డి జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య, మెదక్ జిల్లా కమిటీ సభ్యులు మహేందర్ పాల్గొన్నారు. ఇంకా కాదులూరు మాజీ సర్పంచ్ యాదయ్య, నాయకులు కంది భాగన్న, రొడ్డ సాయిలు, రమేష్ నాయక్, మసన్నగారి నాగరాజు, సంగమేష్, పొట్టిగాళ్ల మోహన్, అజ్జమర్రి లింగం, చింత అనిల్, శివ కుమార్ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

## ప్రభాకర్ సేవలు అభినందనీయం

• సన్మానించిన ప్రజా ప్రతినిధులు

**టీ మీడియా. ఏప్రిల్ 6, టేక్మాల్ ప్రతినిధి:**



మెదక్ జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో అల్లాదుర్గం డిప్యూటీ ఇంజనీర్ డి ఈ గా సుదీర్ఘకాలం పాటు నిష్కళంకమైన సేవలు అందించి పదవీ విరమణ పొందిన ప్రభాకర్ గారిని పలువురు రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఆయన పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభాకర్ గారి వృత్తిపరమైన నిబద్ధతను ప్రజా సేవా దృక్పథాన్ని అందరూ కొనియాడారు.టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ మరియు సర్పంచ్ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రభాకర్ కి శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ విభాగాల్లో అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండి ఎన్నో అభివృద్ధి పనులను ప్రభాకర్ గారు విజయవంతంగా పూర్తి చేశారని ప్రశంసించారు.ఈ వీడ్కోలు సన్మాన కార్యక్రమంలో జిల్లా స్థాయి నాయకులు సైతం పాల్గొన్నారు. మెదక్ ఆర్టిఏ మెంబర్ మల్లారెడ్డి జోగిపేట్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణడిసిసి కార్యదర్శి అషిలీ విద్యాసాగర్మైనార్టీ అధ్యక్షుడు మజర్మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మణికిషన్నువర్ధన్ రెడ్డిపాపయ్య,సర్పంచ్ భూమిరెడ్డి, రామచందర్, తన విధి నిర్వహణలో సహకరించిన ప్రజా ప్రతినిధులకు, తోటి ఉద్యోగులకు మరియు మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఎరువులు, రేషన్, దుకాణాల ఆకస్మిక తనిఖీ

**టీ మీడియా, ఏప్రిల్ 06 , టేక్మాల్ ప్రతినిధి:**



టేక్మాల్ మండల కేంద్రంలోని ఎరువుల ఫర్టిలైజర్ రేషన్ దుకాణాలను సోమవారం తాసిల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను మరియు నిల్వలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.వ్యాపారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారమే విక్రయాలు జరపాలని, రికార్డులను సక్రమంగా నిర్వహించాలని తాసిల్దార్ ఆదేశించారు. రైతులకు మరియు లబ్ధిదారులకు ఎరువులు, నిత్యావసర సరుకుల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని యజమానులకు సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో సాయి శ్రీకాంత్, మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళలను రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తాం

**ఈ మీడియా, ఏప్రిల్ 6 ,చిన్నచింతకుంట:**



మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం చిన్న చింతకుంట మండలం లాల్ కోట గ్రామంలో మహిళ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చిలుకటి సునీత నర్సింహులు గారు ఏర్పాటు చేసిన విజయ డెయిరీ తెలంగాణ పార్లర్ ను తెలంగాణ రాష్ట్ర డైరీ అభివృద్ధి సహకార సమాఖ్య (విజయ డైరీ) ఛైర్మన్ శ్రీ. గుత్తా అమిత్ రెడ్డి తో కలిసి ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి .ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూమహిళలు ఆర్థికంగా ఎదిగే విధంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది అందులో భాగంగా మహిళ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నమని ప్రజా ప్రభుత్వం వచ్చిన వెనువెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించింది. ఉచిత బస్ ప్రయాణమే కాకుండా మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి వారిని, ఆ బస్సులకు ఓనర్లుగా చేశామని,ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని, ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, అన్ని రంగాల్లో వారిని ముందంజలో ఉంచాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం తీసుకుంటున్న చర్యల వల్ల పది మందికి ఉపాధి కల్పించే విధంగా మహిళలు ఎదిగారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాం లు కుట్టే కాంట్రాక్ట్, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, పెట్రోల్ బంకులు, గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ, పాడి పశువుల పెంపకం వంటి వినూత్న పథకాలు ప్రారంభించాం. అంతేకాక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుని...మహిళా సంఘం సభ్యురాలుగా ఉండి ఏదైనా ప్రమాదంలో మృతి చెందితే వారికి 10 లక్షల ఇన్సూరెన్స్ లోన్ బీమా అందిస్తున్నాం. మహిళలు వంటగదికే పరిమితం కాకుండా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నం, పెద్దపెద్ద కార్పొరేట్లకే పరిమితమైన పరిమితం అయిన సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాలకు అప్పగించాం.మన మండలం లో మహిళా సంఘాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సల పరిశీలన పూర్తిచేశాం, త్వరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం.మహిళా సంఘాలకు లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ నిర్ణయం తీసుకుని, మొదటి ఏడాదిలోనే మహిళ సంఘాలకు 21 వేల కోట్ల వడ్డీ లేని రుణాలను ఇచ్చామని మూసాపేట్ మండల కేంద్రంలో పాల శీతలీకరణ కేంద్రాన్ని పునర్ ప్రారంభించాలని విజయ డెయిరీ ఛైర్మన్ ను కోరిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన శ్రీ. గుత్తా అమిత్ రెడ్డి .అనంతరం విజయ డైరీ ఛైర్మన్ శ్రీ. గుత్తా అమిత్ రెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమపై దృష్టి పెడితే ప్రతి నెల స్థిరమైన ఆదాయం వస్తుందని పేర్కొన్నారు.పాలమూరు జిల్లాలో విజయ డైరీ పాల సేకరణతో సమానంగా పాల అమ్మకాలను పెంచాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు..ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

• మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**టి మీడియా,ఏప్రిల్ 06, వెల్గటూర్:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' లక్ష్యం ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు.సోమవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వెల్గటూర్,ఎండపల్లి మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులను మంత్రి అందజేశారు. అదేవిధంగా, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 78 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ. 25.40 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం,ముగ్గురు దివ్యాంగులకు ప్రభుత్వం తరపున ఉచితంగా స్కూటర్లను అందజేసి వారి ముఖాల్లో ఆనందాన్ని నింపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ,ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఇప్పటికే నాలుగింటిని విజయవంతంగా అమలు చేస్తున్నామని గుర్తుచేశారు."రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలి.ప్రజాప్రతినిధులుగా గెలిచిన తర్వాత పార్టీలకు అతీతంగా ప్రజలందరి సమస్యలను పరిష్కరించడమే మా ప్రాథమిక బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు.ప్రజల ముంగిటకే పాలన అనిరాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముందుకు సాగుతోందని,ప్రతి గ్రామంలో పర్యటించి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయిలో సమస్యలను తెలుసుకుని,వాటిని వెనువెంటనే పరిష్కరించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి మండల అధ్యక్షులు శైలెందర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ బండమిది కవిత,కోటిలింగాల ఆలయ కమిటీ చైర్మెన్ పుదరి రమేష్,ఆర్ డి ఓ మధుసుదన్ జిల్లా ఎస్సి సంక్షేమ అధికారి రాజు,స్థానిక తహసీల్దార్ శేఖర్,ఎంపీడీఓ నరేష్ కుమార్,ఎండపల్లి తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్,ఎంపీడీఓ కృపాకర్,ఆర్ ఐ అన్వేష్,స్థానిక ప్రజాప్రతినిధులు,మాజీ సర్పంచ్ మురళీధర్ గౌడ్, సందీప్ రెడ్డి,మద్దుల గోపాల్ రెడ్డి,వివిధ గ్రామాల సర్పంచ్ లు వార్డ్ మెంబెర్ లు వివిధ శాఖల అధికారులు,లబ్ధిదారులు, పాల్గొన్నారు.

## యూత్ ఆధ్వర్యంలో ఎడ్ల పందాల పోటీలు

**టి మీడియా,ఏప్రిల్ 06,ఎండపల్లి:**



చర్లపల్లి గ్రామంలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల పందాల పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగాయి.ఈ గ్రామీణ క్రీడా పోటీలను వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.పోటీల అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడిదం మొగిలి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడలనుప్రోత్సహించడంలో యువత ముందుండటం అభినందనీయమని కొనియాడారు.పోటీలలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ఎడ్ల జతలు హోరాహోరీగా తలపడ్డాయి.ఈ పోటీలో గెలుపొందిన విజేతల కు దేవుడి చిత్రపటాలతో పాటు నగదు బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి, మితాన్స్ గౌడ్,కర్ణమామిడి గ్రామం,రూ. 20,000,ధ్వితీయ బహుమతి గుండు మల్లన్న,శకల్ల గ్రామం,రూ. 15,000,తృతీయ బహుమతి మాదాసు గంగయ్య.10,000,గెలుపొందారు.ఈ కార్యక్రమంలో గ్రామ యువత,వార్డు సభ్యులు, వివిధ గ్రామాల నుండి వచ్చిన పోటీదారులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన పుర ఛైర్మన్, వైస్ ఛైర్మన్

**గోడిసెల సంధ్యరాణి ,మిట్టపల్లి సరిత**

**టీ మీడియా, ఏప్రిల్ 6, రామకృష్ణాపూర్;**





క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో నూతనంగా బిఆర్ఎస్,సిపిఐ పార్టీల నుండి ఎన్నికైన పుర ఛైర్మన్,వైస్ ఛైర్మన్,కౌన్సిలర్ల విజయోత్సవ ర్యాలీని సోమవారం నిర్వహించారు. ముందుగా రామాలయం చౌరస్తాలో ఆంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపించి స్వామి ఆశీస్సులు,తీర్థ ప్రసాదాలు తీసుకున్న అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు,డీజే సప్పులతో డాన్సులు చేస్తూ,బాణసంచాలను కాలుస్తూ,బైక్ ర్యాలీతో వెళ్లి అంబేద్కర్,తెలంగాణ తల్లి, జయశంకర్ విగ్రహాలకు పూలమాలవేసి కేసీఆర్, అంబేద్కర్ చిత్రపటాలతో పుర కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం 17వ వార్డు బిఆర్ఎస్ అభ్యర్థి కౌన్సిలర్ అయిన గోడిసెల సంధ్యరాణి నూతన చైర్ పర్సన్ గా,22వ వార్డు సిపిఐ అభ్యర్థి కౌన్సిలర్ అయిన మిట్టపల్లి సరిత వైస్ చైర్ పర్సన్ గా సోమవారం అధికారికంగా నూతన బాధ్యతలు స్వీకరించారు.పుర కమిషనర్ మారుతి ప్రసాద్ వీరిద్దరిని శాలువాలతో సత్కరించడం జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ మాట్లాడుతూ బాల్క సుమన్ అన్న ఆశీస్సులు, దిశానిర్దేశంతో క్యాతనపల్లి మున్సిపాలిటీని ప్రగతి పథంలో నడిపించేందుకు నేడు అత్యంత ఉత్సాహపూరితంగా సమర్థవంతమైన పనితీరుతో ప్రజల అపారమైన నమ్మకం, ఆకాంక్షలకు అనుగుణంగా క్యాతనపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాలలో ముందు వరుసలో ఉండేటట్లు ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పని చేస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. పదవి బాధ్యతలు స్వీకరించిన తక్షణమే, మున్సిపాలిటీ అభివృద్ధికి సంబంధించిన అత్యంత కీలకమైన దస్త్రాలపై వారు తొలి సంతకం చేశారు.అలాగే ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికి వారు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, తమకు ఓటు వేసి ఆశీర్వదించిన పట్టణ ప్రజలకు చైర్మన్,వైస్ చైర్మన్ లు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చెన్నూరు ఇంచార్జ్ డాక్టర్ రాజా రమేష్, పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్,రామిడి కుమార్, సిపిఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, బిఆర్ఎస్, సిపిఐ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం వేడుకలు

**టీ మీడియా, ఏప్రిల్ 6, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలోని స్థానిక ఎస్వీఎంఆర్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం దాచాలక్షయ్య ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించబడినట్లు ప్రిన్సిపల్ ఎన్. నాగరాజు తెలిపారు.

ఈ కళాశాల వార్షికోత్సవంలో కళాశాల కరస్పాండెంట్ ఎస్. విజయ్ మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదే విధంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కష్టపడి చదివే స్వభావం మరియు స్పష్టమైన లక్ష్యాలను ఏర్పరుచుకొని తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు చంద్ర పాషా, చంద్రమౌళి, అధ్యాపకులు, అధ్యాపకురాలు వారణాసి కల్పన, దివ్య, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు అని ప్రిన్సిపల్ తెలిపారు.